నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి
నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట
బుధవారం 05, జూన్ 2024 పేజీలు



నల్గొండ పార్లమెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కుందూరు రఘువీర్ రెడ్డికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎన్నికల పరిశీలకులు మనోజ్ కుమార్, మాణిక్ రావు, సూర్యవంశీ, కలెక్టర్ దాసరి హరిచందన.

# రెండు పార్లమెంటు స్థానాలు హస్తగతం

- ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జోరు
- మొదటి రౌండు నుండి కాంగ్రెస్ అభ్యర్థులకే లీడ్
- రఘువీరారెడ్డి 5,59,906, కిరణ్ కుమార్ రెడ్డి 2,10,192 ఓట్లు

**నల్లగొండ ఉమ్మడి జిల్లా బ్యూరో**

నల్లగొండ, భువనగిరి రెండు లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు హస్తగతం చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన విషయం విధితమే. అదేవిధంగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ప్రజలు రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టారు. మంగళవారం నల్లగొండ శివారులోని దుప్పలపల్లి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ గోదాములో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. నల్లగొండ లోక్‌సభ లెక్కింపుకు 24 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మొదటి రౌండ్ నుండి 24వ రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ఆధిక్యం కొనసాగించారు. బిజెపి, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇద్దరు కూడా వెనుకబడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డికి 7,84,337 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 2,24,432 ఓట్లు రాగా బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 2,18,417 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డికి రాష్ట్రంలో ఏ పార్టీ అభ్యర్థికి రానటువంటి భారీ మెజారిటీ 5,59,906 ఓట్లు సాధించారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంటులో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి తన సమీప బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌పై 2,10,192 ఆధిక్యంతో గెలుపొందారు. భువనగిరి లోక్‌సభ, నల్లగొండ లోక్‌సభ రెండు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు దారుణంగా ఓటమిపాలయ్యారు. నల్లగొండ పార్లమెంటులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 20,129 రాగా కాంగ్రెస్ అభ్యర్థికి 12,073 ఓట్లు, బిజెపి అభ్యర్థికి 4,826 బిఆర్ఎస్ అభ్యర్థికి 1,736 ఓట్లు పడ్డాయి. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు రఘువీర్ రెడ్డి ఎంపీగా విజయం సాధించడంతో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు



హర్షం వ్యక్తం చేశారు. నెలరోజులుగా ఉత్కంఠగా ఎదురుచూసిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారు. నల్లగొండ లోక్‌సభ పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ శాసనసభ్యులు గెలుపొందడం వారంతా కలిసికట్టుగా రఘువీర్ గెలుపు కోసం విశేషమైన కృషి చేసినందునే గెలుపొందారని పలువురు పేర్కొంటున్నారు. నల్లగొండ లోక్‌సభ పరిధిలోని దేవరకొండ, నాగార్జునసాగర్ మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికి ఘనవిజయం సాధించి పెట్టారు. నల్లగొండ లోక్‌సభ పరిధిలో 17,25,465 ఓట్లకు గాను 12,77,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్రంలో ఏ అభ్యర్థికి రానటువంటి భారీ మెజారిటీ 5,59,906 ఓట్లతో గెలిపించారు. ఏది ఏమైనప్పటికీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు నల్లగొండ, భువనగిరి ఖిల్లాపై కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు.

# సోనియాగాంధీకి అంకితం

**- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**



భువనగిరి మేజర్‌న్యూస్ఃముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇచ్చిన మాట ప్రకారం భువనగిరి పార్లమెంట్ స్దానంను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో మునుగొడు ఎమ్మెల్యే డబుల్ సూటర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సఫలికృతమైనారు. ఈ సందర్బంగా భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్దిగా కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులలో పార్టీకి సేవలు అందించిన వ్యక్తి చామల కిరణ్ కుమార్‌రెడ్డి పేరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనౌన్స్‌మెంట్ చేసి,మునుగొడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి భువనగిరి భధ్యతలను అప్పగించిన దగ్గర నుండి రాజగోపాల్‌రెడ్డి తనదైన శైలిలో పార్లమెంట్ పరిదిలోని 7 నియోజక వర్గాల పరిదిలో 6 నియోజక వర్గాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడం,భువనగిరి ఎంపి సీటును కైవసం చేసుకోవడంలో అందివచ్చిన అవకాశం అని రాజకీయ పరిశీలకు భావన. భువనగిరి నియోజక వర్గం మరియు ఆలేరు నియోజక వర్గం నుండి అత్యధిక ఓట్లు రాబట్టడంలో ఆ ఎమ్మెల్యేలు చేసిన కృషి ఫలితమే ఈ విజయం. ఈ సందర్బంగా భువనగిరి పార్లమెంట్ పరిదిలో కాంగ్రెస్ అభ్యర్ది చామల కిరణ్ కుమార్‌రెడ్డికి-2,29,143,బీఆర్ఎస్ అభ్యర్ది క్యామ మల్లేష్‌కు -2,56,187,బిజెపి అభ్యర్ది భూర నర్సయ్య గౌడ్‌కు- 4,06,973 ఓట్లు వచ్చినవి. ఓట్ల లెకింపు అనంతరం మునుగొడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి,ఆలేరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మరియు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పాల్గోని మాటలాడుతు భువనగిరి పార్లమెంట్ పరిదిలోని ప్రజలు కాంగ్రెస్‌కు స్పష్టమైన విజయంను అందించారని,కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టి అని,ప్రజలకు సేవ చేసే పార్టీ అని,సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించే పార్టీ అని నమ్మి గెలిపించారని తెల్పారు. ఆరోరా కాలేజీ నుండి కాంగ్రెస్ శ్రేణులు భారి ర్యాలీతో భువనగిరి పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్బంగా గెలిచిన అభ్యర్ది చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాటలాడుతు తన గెలుపుకు సహకారం అందించిన ఆరుగురు ఎమ్మెల్యేలకు మరియు ముఖ్యంగా భువనగిరి పార్లమెంట్ భాధ్యతలను తన భుజస్కాంధాలపై వేసుకుని,గెలిచే వరకు పని చేసిన రాజగోపాల్‌రెడ్డికి కృత్ణతలు తెల్పారు. అదేవిదంగా ఓటర్ల దేవులకు ధన్యవాదంలు తెల్పారు. ఈ గెలుపు సోనియాకు అంకితం అని తెల్పారు. కేంద్రం నుండి రావలసిన నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో,మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో తీసుకు వచ్చి భువనగిరి పార్లమెంట్‌ను అన్ని విధాలుగా అబివృద్ది చేస్తానని తెల్పారు. ఈ కార్యక్రమములో పార్లమెంట్ పరిదిలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గోన్నారు.

# శ్రీ సాయి సన్నిధిలో సప్త దశమ వార్షికోత్సవాలు

**- జూన్ 7 శుక్రవారం, 8 శనివారం, 9 ఆదివారం**

**- భారీ ఎత్తున ఏర్పాట్లు ముస్తాబతున్న చింతపల్లి సాయి సన్నిధి**

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి సాయి సన్నిధిలో 17వ వార్షికోత్సవ సందర్భంగా సాయి మందిరము ముస్తాబవుతుంది. సాయి సన్నిధిలో జూన్ 7 శుక్రవారం 8 శనివారము 9 ఆదివారము మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మంచికంటి ధనంజయ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ చింతపల్లిలో భక్త చింతామణిగా వెలిసి 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీ సాయి సన్నిధిలో 17వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీ శుక్రవారం ఉదయం షోడశ బుజ వినాయక గౌరీ పూజ, దేవ పుణ్య హవాచనం, ధ్వజారోహణము, గోపూజ, అఖండ దీప స్థాపన, దీక్ష కంకణ ధారణ, పంచగవ్యప్రాసన, మండపారాధనలు, యాగశాల ప్రవేశము, అగ్నిప్రతిష్ట, సహస్ర మోదక లక్ష్మీ గణపతి నవగ్రహ హెూమము, పూర్ణాహుతి, ఎనిమిదో తేదీ శనివారం మండపారాధన పూజలు తీర్థప్రసాదాలు, గండబేరుండ లక్ష్మీనరసింహ హెూమం, అనంతరం పూర్ణాహుతి ఉంటుందని ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు. చివరి రోజు 9వ తేదీ ఆదివారం ఉదయం మండపారాధనలు, మూలమంత్ర



సంపుటికరణ సహిత విజయ చాముండేశ్వర హెూమం, అనంతరం పూర్ణాహుతి, ఉదయం 11 గంటలకు శ్రీ సాయినాధునికి మహాబలాభిషేకం అష్టోత్తర శత కలశాల మంత్రజలములతో అభిషేకం, అనంతరం శ్రీ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి వారి కళ్యాణ మహెూత్సవం. సాయంత్రం 6 గంటలకు సాయినాధుని శోభ యాత్ర, శ్రీ మొక్కపాటి బ్రహ్మం మాస్టర్ నేతృత్వంలో సుశిక్షితులైనట్టి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసినట్టు వారి శిష్య బృందాలు కోలాటాలు, భజనలతో, విద్యుత్ దీపకాంతులతో, దివ్యాలంకృత శకటంపై రాజాధిరాజు యోగి రాజు త్రిలోక పాలకుడైన సాయినాధుడి శుభ యాత్ర వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ప్రతి నిత్యము ఉదయం అల్పారము మధ్యాహ్నము నారాయణ సేవ పేరున మహన్నదానం సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీ నందనామాచారి, శేఖర్ గోవిందు గిరిలచే భక్తి సంగీత సేవ జరుగుతున్నట్లు తెలిపారు. 360 పై గోమాతలను సందర్శించి ముక్కోటి దేవతలను సందర్శించిన సంతృప్తిని పొందండి అని చైర్మన్ తెలిపారు.

# పుష్కరిణి చెంతగల ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న పూజారి

యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగవారం క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి వారికి శాస్త్రోక్తంగా నాగవల్లి దళార్చనలు కొనసాగాయి. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి నిత్యారాధనలు జరిగాయి. విష్ణు పుష్కరిణి చెంత గల ఆంజనేయ స్వామికి అర్చక బృందం మాన్య సూక్త పటణాలతో అభిషేకం నిర్వంహించారు. సింధూరం వివిధ రకాల పూల మాలలతో స్వామిని అలంకరించి సహస్ర నామ పటణాలతో నాగవల్లి దలార్చన నిర్వహించారు. ప్రధాన ఆలయంలో స్వయంభూలను  కవచం మూర్తులను పూజించిన అర్చకులు మం డపంలో ఉత్సవమూర్తులకు అభిషేకించి అర్పించారు. పాతగుట్టలో ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు. అనుబంధ రామలింగే శ్వరుడిని కొలిచి చర మూర్తులను పంచామృతాలతో అభిషేకించి బిల్వ పత్రాలతో అర్పించారు. మంగళవారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఖజానా 37,86,721.

# యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు గర్భాలయ ప్రవేశం



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు గర్భాలయ ప్రవేశం మంగళవారం నుంచి ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విజ్ఞప్తి మేరకు ప్రతి మంగళవారం స్థానిక యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు స్వామి వారి గర్భ ఆలయ ప్రవేశాన్ని ప్రతి మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుండి 5:30 వరకు ఉంటుంది. స్థానికులు యాదగిరిగుట్టలో ఉంటున్న ఐడి ప్రూఫ్ చూపిస్తే అంతారాలయం దర్శనముకు అనుమతిస్తారు. అలాగే సాంప్రదాయ దుస్తులు వచ్చిన భక్తులకే ఈ ప్రవేశం ఉంటుంది. దీంతో యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రముఖ శిల్పిని సన్మానించిన వంగపల్లి అంజయ్య స్వామి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ప్రముఖ శిల్పిని సన్మానించిన భక్తిరత్న అవార్డు గ్రహీత డాక్టర్ వంగపల్లి కొలనుపాక బింభావతి పట్నం వాస్తవ్యులు సీనియర్ శిల్పి మామిడాల కిష్టయ్య కుమారుడు ప్రముఖ శిల్పి మామిడాల విటల్ మంగళవారం కాచారంలోని కైలాసపురం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపన నిర్వహకులు భక్తి అవార్డు గ్రహీత వంగపల్లి అంజయ్య స్వామి శిల్పి మామిడాల విఠల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంగపల్లి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కొన్ని వందల విగ్రహాలను వారికి అనుకున్న విధంగా చెక్కి శిల్పి తన ప్రావీణ్యతను చాటుకుని అతి తక్కువ ధరకు అందించారు. ఇంత చక్కటి శిల్పి ఆలేరు సమీపంలో ఉండడం యాదాద్రి భువనగిరి జిల్లా కి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ భక్త బృందం సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు ఆర్యవైశ్య నాయకులు సినీ నిర్మాతలు సామ శ్రీధర్ పంజాల వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డు పరిస్థితి

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః దేశ ఆర్థిక వ్యవస్థ మరింత గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. కార్పొరేట్లకు ఉద్దీపన వంటి ప్యాకేజీలు ప్రకటించినా ఇప్పట్లో ఎగబాకే సూచనలు కనిపించడం లేదు. రెండురోజులకత్రం వెల్లడైన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) నివేదికలో భారత్ ఆర్థిక వ్యవస్థ తాము ఊహించిన దానికంటే ఎక్కువగా మందగించిందని తేల్చింది. తాజాగా భారతీయ రిజర్వు బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ కూడా ఆర్థిక సంక్షోభం ఇంతగా దిగజారుతుందని తాను అనుకోలేదని అన్నారు. అంటే సంక్షోభ తీవ్రత ఎంత ఆందోళనగా ఉందన్నది తెలుస్తోంది. ఇక ఈ పరిస్థితిని చక్కదిద్దడం తనవల్ల కాదన్న అభిప్రాయానికి దాస్ వచ్చేశారు. వాస్తవానికి వృద్ధిరేటు ఐదు శాతానికి పడిపోవడం ఆశ్చర్యంగా ఉందని శక్తికాంతదాస్ నోటివెంట అలాంటి మాటలు రావడాన్ని బీజేపీ పెద్దలు ఊహించి ఉండరు. ఎందుకంటే ఏరికోరి శక్తికాంతదాస్‌ను ఆర్‌బీఐ గవర్నర్‌గా ప్రధాని మోడీ తెచ్చిపెట్టుకున్నారు. ఇప్పుడు ఆయన కూడా చేతులెత్తేయడం గమనార్హం. సంక్షోభాన్ని గట్టెక్కిస్తారని ఆశించిన బీజేపీ నేతలకు ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు రుచించకపోయి ఉండొచ్చు. ఎంతోకొంత పడిపోతుందని అంచనా వేశాం తప్ప ఇంత తక్కువగా ఉంటుందని అనుకోలేదని వృద్ధిరేటును చూసి ఆయన ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదు. కేంద్రంలోని కార్పొరేట్ వింగ్‌లో ఆర్థిక సెక్రటరీగా గుర్తింపు తెచ్చుకున్న శక్తికాంతదాస్‌కు ఆర్థిక పరిస్థితి గురించి ముందుగానే అంచనా లేదనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఆయన మోడీకి నమ్మినబంటు. ప్రస్తుత పరిస్థితుల్లో మందగమనాన్ని అంచనా వేసి చెప్పడం కష్టమేనని చెప్పిన గవర్నర్.. రెండో త్రైమాసికంలో వృద్ధి మరింత కుంగిపోయే అవకాశం ఉందని చెప్పకనే చెప్పారు. అయితే, ఉద్దీపన చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి వేగంగా పుంజుకుంటుందన్న ఆశ ఆయనకు ఏ కోశానా లేదు. పొమ్మనలేక పొగపెట్టినట్టుగా రఘురామ్‌రాజన్‌ను, ఉర్జిత్‌పటేల్‌ను తప్పుకునేలా చేసిన మోడీ సర్కార్ శక్తికాంతదాస్‌ను అలా సాగనంపుతారని అనుకోలేం.

కార్పొరేట్ అనుకూల నిర్ణయాలే ప్రస్తుత ఈ పరిస్థితికి కారణం. నోట్లరద్దు, జీఎస్టీలు ఆర్థికరంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టేసాయి. ఈ విధానాలు చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగాలను కుప్పకూల్చాయి.. కనీస వేతన చట్టం అమలుగాక పోవడం, ఉపాధి తగ్గడం, ఉద్యోగాలు పోవడం జరుగుతున్నాయి. కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రుణాలివ్వడం వల్ల బ్యాంకులు దివాళా తీశాయి. ఎల్‌ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్ ఇండియాలను అమ్మకానికి పెట్టింది. అందులో భాగంగానే భారత్ పెట్రోలియం సంస్థను అమ్మేయడానికి రేటు కూడా ఖరారు చేసింది. ఆఖరుకు రక్షణ సంస్థలనూ ప్రయివేటీకరించేందుకు సిద్ధమైంది. బొగ్గులోనూ విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. ప్రస్తుత సంక్షోభానికీ, ప్రజల మధ్య అసమానతలు పెరగడానికీ ప్రధాన కారణం ప్రభుత్వరంగాన్ని విస్మరించి ప్రయివేటు పెట్టుబడులకు అనుమతించడమేనన్నది అనుభవం చెవుతున్న సత్యం.

వృద్ధి రేటు ఐదుశాతంగా పడిపోయిందని కేంద్రప్రభుత్వం గతనెలలోనే ప్రకటించింది. అయితే, మందగమన పరిస్థితులు పోయి ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు కోలుకుంటుందన్న దానికి శక్తికాంతదాస్ వద్ద స్పష్టమైన సమాధానం లేదు. సర్కారు సరైన చర్యలు తీసుకుంటే పరిస్థితులు చక్కబడొచ్చంటున్న ఆర్‌బీఐ గవర్నర్ ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలు మంచివేనని చెప్పేందుకు వెనుకాడుతున్నారు. రిజర్వు బ్యాంకు నుంచి అందుకున్న లక్షన్నరకోట్లకు పైగా సొమ్ములో బ్యాంకులకు రూ. 70వేలకోట్లను కేంద్రం కేటాయించింది. నిరర్థక ఆస్తుల ఊబిలోకి జారిపోయిన బ్యాంకులను బయటకు లాగే పేరిట విడతలవారీగా వేలకోట్లు కుమ్మరిస్తున్నది. బ్యాంకుల వద్ద డబ్బు లేకపోవడానికి కారణం పారిశ్రామికవేత్తల్లో కొందరు తీసుకున్న డబ్బును చెల్లించకుండా ఎగ్గొట్టడమే. బ్యాంకులను మోసగించిన వారిపై ఎలాంటి చర్యలూ లేవు. వారి నుంచి వసూళ్లు చేస్తున్నదీ లేదు. మందగమనానికి ప్రజల్లో కొనుగోలుశక్తి లేకపోవడమే ప్రధాన కారణం. విదేశీపెట్టుబడుల కోసం ద్వారాలు తెరవడం, పారిశ్రామికవేత్తలకు ఉద్దీపనలు, రాయితీలు, వడ్డీరేట్లు తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకున్నా ఇవేమీ దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను ఆదుకోలేవన్నది ఆర్థికనిపుణుల విశ్లేషణ.

యాజమాన్యాలను ఆదుకునేందుకు కేంద్రం పెద్దలు హడావుడి పడ్డారే గాని, ఉద్యోగాలు కోల్పోయిన వారికి, నిరుద్యోగులకు సహాయంగా చిటికెన వేలు కదల్చలేదు. ఈ ఉద్దీపన కుబేరులకు తప్ప సామాన్యులకు ఒరగబెట్టిందేమీ లేదు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం వ్యవహరించిన విధానాల వల్లనే అసమానతలు పెరిగాయన్నది వాస్తవం. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు, ప్రభుత్వ పెట్టుబడులను ప్రోత్సహించడమే పరిష్కారమార్గమని అమర్త్యసేన్, ప్రభాత్‌పట్నాయక్ లాంటి ఆర్థిక వేత్తలతో పాటు వామపక్షాలూ చెబుతున్నాయి. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం మేధావుల విజ్ఞప్తులను చెవికెక్కించుకుంటున్నదెక్కడీ.

# మహా మంచిమాట

కులం అడ్డుగోడలు – మతం నిలువు గోడలు మనిషి జీవితాన్ని ఛిద్రం చేస్తున్న సమాజం మనది. తమ కులానికి చెందని వారిని, తమ మతం కానివారిని ప్రేమించినందుకు, పెండ్లాడినందుకు సొంత బిడ్డల్ని సైతం నిర్ధాక్షిణ్యంగా నరికి చంపుతున్న దుస్థితి. ఈ నేపథ్యంలో బుధవారంనాడు సర్వోన్నత న్యాయస్థానం కుల, మతాంతర వివాహాలపై వెలువరించిన అభిప్రాయం అక్షరాలా అనుసరణీయం. ”కులాంతర, మతాంతర వివాహాలకు వ్యతిరేకం కాదు. అలాంటి వివాహాలవల్ల 'సమాజవాదం' బలపడుతుంది. హిందూ–ముస్లిమ్ వివాహాలు కూడా ఆమోదయోగ్యమే. చట్టప్రకారం ఒకరినొకరు పెండ్లాడితే సమస్య ఏముంటుంది. కులాల అంతరాలు కూడా తొలగిపోతే మంచిదే. ఉన్నత కులాలు, నిమ్న కులాలుగా చెప్పుకుంటున్నవాళ్లు పెండ్లిండ్లు చేసుకుంటే మరింత మేలు” అని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎం.ఆర్.షాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన హిందూ యువతిని ముస్లిం యువకుడు హిందూ మతంలోకి మారి పెండ్లి చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆమె తండ్రి హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆ ఇద్దరూ కలిసి జీవించవచ్చునని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అమ్మాయి తండ్రి సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈ కేసును విచారించేందుకు ధర్మాసనం అంగీకరించలేదు. ఈ కేసు విచారణ జరపబోమని స్పష్టం చేస్తూ ”ఆమె ప్రయోజనాలు కాపాడాలని తాము కోరుకుంటున్నామని, ఆ యువతిని బాగా చూసుకోవాలని, నమ్మకమైన భర్తగానేకాక గొప్ప ప్రేమికునిగా మసలుకోవాలని” కోర్టు అతనికి సూచించింది.

భారత రాజ్యాంగం, చట్టం ఏనాడూ కుల, మత వివక్షలను అంగీకరించలేదు. వ్యక్తులు ఏ మతం నుంచి ఏ మతంలోకైనా మారే స్వేచ్ఛను, అలాగే ఏ మతం, కులంవారినైనా వివాహమాడే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు కూడా తయారు చేసింది. అయితే చట్టం కన్నా విశ్వాసం ముఖ్యమని భావించేవాళ్లు, రాజ్యాంగం కన్నా మనుధర్మం ఉత్తమమని నమ్మేవాళ్లూ మాత్రం చట్టాలను చట్టుబండలు చేసి మానవత్వాన్ని మంటగలుపుతున్నారు. మత విశ్వాసం, కులహౌదా చుట్టూ అల్లబడిన మాయ (మిత్)కు లోనై, 'స్థాయి' (స్టేటస్)కు బందీలై తమ కులం కలుషితం కాకుండా, మతం మలినం కాకుండా కాపాడుకోవాలన్న 'అహం'తో ఆలోచనలు కమ్మేయగా తమవేలితో తమ కండ్లనే పొడుచుకుంటున్నారు.

మానవత్వం ఉన్న తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరైనా తాము అల్లారుముద్దుగా కనిపెంచుకున్న తమ రక్తం పంచుకు పుట్టిన వాళ్ళు పచ్చగా పది కాలాల పాటు బతకాలనుకుంటారు. అందుకు ఎంతో శ్రమిస్తారు. అయితే వివాహం విషయంలోకి వచ్చేసరికి తమ ఆచారాలను పాటించని తమ పిల్లల ఎడల హంతకులుగా మారిపోతారు. తమ పిల్లలను వివాహమాడే వ్యక్తులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, వారి దాంపత్య జీవితం సాఫీగా, సుఖవంతంగా సాగిపోతుందన్న నమ్మకమున్నప్పటికీ కేవలం కులం, మతం కారణంగా వారి వివాహాన్ని అడ్డుకుంటారు, వారిని అంతమొందించే దుస్థితికైనా దిగజారుతారు. దిగజారుతున్నారు కూడా. మన దగ్గర ప్రణరు ఉదంతం నుంచి, కేరళకు చెందిన హరియా ఇప్పుడు ఈ యువతి వరకూ ఇలాంటి ఉదంతాలు మన దేశంలో వేలూ లక్షలు.

నిజానికిది ఒక భయంకరమైన మానసిక సమస్య. అంతకుమించి భావజాల సమస్య. అవును! వ్యక్తులను తమతమ కులాల, మతాల పరిధిలో బంధించేందుకు సృష్టించిన భావజాలాలు అనివార్యంగా ఆయా కుల, మతస్తుల బుర్రకెక్కి వారిని బుద్ధిహీనులుగా మార్చుతున్నాయి.

రక్త సంబంధీకులు అన్య కుల, మతస్తులను ప్రేమించి, పెండ్లాడే సమయంలో వారి కుటుంబ సభ్యులు ఇంత కిరాతకంగా ప్రవర్తించేందుకు వారి చుట్టూ ఉన్న సాటి కులస్తులు, మతస్తులు కూడా ఒక ప్రధాన కారణం. ఇంకా భూస్వామ్య భావజాలం అధికంగా ఉన్న మన దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రామంపై తమ పట్టు నిలుపుకునేందుకు కులపెద్దలు ఇలాంటి విషయాలలో ఆయా కుటుంబీకులపై నిర్ధాక్షిణ్యంగా, దారుణంగా ప్రవర్తిస్తారు. హర్యానా ఖాఫ్ పంచాయతీలంత భయంకరంగా భౌతిక దాడులకు పాల్పడనప్పటికీ, మానసికంగా, సామాజికంగా వారిని ఒంటరి చేసి, వెలివేస్తారు. కుల, మతాతీత వివాహాలు జరిగిన కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు వివాహాలు కాకుండా వేధిస్తారు. సాటి సమాజం నుంచి ఎదురయ్యే ఈ దారుణ మానసిక, శారీరక, సామాజిక దాడిని తట్టుకోలేక తమ పిల్లలు చేసిన 'పాపానికి' ప్రక్షాళనగా పాము తన పిల్లలను తానే చంపుకుతిన్నట్టు ప్రవర్తిస్తారు.

ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం పలికిన హిత వచనాలు, చేసిన సూచనలు సాటి మనుషుల పుట్టుక కారణంగా వారిపై వివక్ష ప్రదర్శించే చెంపపెట్టులాంటివి. మూర్ఖపు కులతత్వం నిండిన తల్లిదండ్రులకు, రక్త సంబంధీకులకు కనువిప్పులాంటివి. సర్వోన్నత న్యాయస్థానం హితవచనాలను నిండుమనస్సుతో స్వీకరిద్దాం. మనమూ పాటిద్దాం. వివక్ష కానరాని ఉన్నత సమాజంవైపు అడుగులేద్దాం.

# ఒకే భాష ఎవరి కోసం..?

***”జన గణ మన అధినాయక జయహే!***
***భారత భాగ్యవిధాతా!***
***పంజాబు సింధు, గుజరాత, మరాఠా***
***ద్రావిడ, ఉత్కళ, వంగ!***
***వింధ్య, హిమాచల, యమునా గంగ***
***ఉచ్ఛల జలధితరంగ!”...***

అంటూ వైవిధ్య భరితమైన భారతదేశ భౌగోళిక, భాషా, సాంస్కృతిక ముఖచిత్రాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తాడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.. ఇది కోట్లాది మంది భారతీయులు గొంతుల్లో ప్రతిధ్వనించే మన జాతీయగీతం. మన జాతీయ భావనకు, నిజమైన భారతీయతకు ఓ ప్రతీక. రవీందదు చెప్పినట్టు భిన్న మతాలకు, భిన్నజాతులకు, భిన్న భాషలకు, విభిన్న సంస్కృతులకు నిలయం ఈ నేల. భిన్నత్వంలో ఏకత్వం.. ఏకత్వంలో భిన్నత్వమే భారతీయతగా నిర్మించబడ్డ దేశం. కాబట్టే సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణమని ”ప్రతిజ్ఞ” చేస్తున్నాం. కానీ నేడు ఆ భారతీయతకే ప్రమాదం ముంచుకొస్తుందా..? పాలకపార్టీ నేతల ప్రకటనలు, వారి పాలనా తీరూ చూస్తుంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయి. ”ఒకే దేశం.. ఒకే భాష” అంటూ బీజేపీ అధ్యక్షుడు, హౌం మంత్రి అమిత్‌షా తాజా ప్రకటన దీనిని మరింత రుజువు చేయటమే కాదు, దేశంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది.

”హిందీ దివస్” సందర్భంగా.. హిందీ జాతీయ భాషగా అమలు పరచాలనీ, అందరూ హిందీ మాట్లాడాలనీ, దేశాన్ని ఏకం చేయగలిగే భాష హిందీ ఒక్కటేననీ సెలవిచ్చారు అమిత్‌షా. ఇది రాజ్యాంగ విరుద్ధమే గాక, భారతదేశ ఔన్నత్యానికే పెను సవాలు. ఎందుకంటే.. ఈ దేశం భిన్న జాతుల, మతాల, భాషల, సంస్కృతుల సమాహారం. అందుకే స్వాతంత్ర్యానంతరం ఈ దేశాన్ని ”భారత యూనియన్”గా ప్రకటించుకున్నాం. కానీ, ఇప్పుడా సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలిగించే విధంగా బీజేపీ వ్యవహరిస్తున్నది. ఇప్పటికే అమలులోకి తెచ్చిన ఆర్టికల్ 370 రద్దు వంటి అప్రజాస్వామిక నిర్ణయాలు మొదలుకుని ఇప్పుడు ”ఒకే దేశం ఒకే భాష” అనే అప్రజాస్వామిక ప్రతిపాదన వరకూ అన్నింటా ఇదే వ్యక్తమవుతుండటం గమనార్హం! ఈ దేశంలో 130 కోట్లమంది ప్రజలున్నారు. మెజారిటీ ప్రజలకు హిందీ మాతృభాష కాదు. దేశం మొత్తం మీద చూసినా హిందీ మాట్లాడేవారు 45శాతానికి లోపే. కాబట్టే మన రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో 22 భాషల్ని అధికార భాషలుగా గుర్తించింది. ఈ విధంగా అన్ని భాషలకూ సమాన ప్రాధాన్యతనిస్తూ మన భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడటానికి, భావోద్వేగపరమైన అనేక సమస్యల పరిష్కారానికీ కృషి చేసారు మన రాజ్యాంగ నిర్మాతలు. ఈ నేపథ్యాన్ని విస్మరించి ఒక భాషను దేశం మొత్తం మీద రుద్దడమంటే అది ప్రజలపై దాడి చేయడమే. 21వ రాజ్యాంగ సవరణ 1967 ద్వారా రాష్ట్రాలకు కల్పించిన భాషాధికారాలకు చెల్లుచీటి రాయడమే. అంతే కాదు.. దేశంలో ప్రతి పౌరుడు తనకు నచ్చిన భాషను ఎంచుకునే హక్కును కల్పించే రాజ్యాంగంలోని 29వ అధికరణాన్ని కూడా ధిక్కరించడమే. ఇంతకు తెగించి కోట్లాది ప్రజల మాతృభాషలను కాలరాసాక ప్రజల అభివ్యక్తికి అసలు అవకాశముంటుందా..!?

సూర్య

05-06-2024 బుధవారం

# కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



బీబీనగర్,మేజర్,న్యూస్ః భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి భారీ మెజర్టీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం బీబీనగర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండలకేంద్రంలోని పోచంపల్లి రోడ్డు చౌరస్తాలో బాణసంచా కాల్చి, స్వీట్ల్ పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ గోళి ప్రణీతాపింగల్ రెడ్డి, జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు గోళి నరేందర్ రెడ్డి,టంటం భార్గవ్,మండల అధ్యక్షుడు సురకంటి సత్తి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పంజాల పెంటయ్య గౌడ్,మాజీ ఎంపీపీ టంటం లక్ష్మయ్య, పంజాల వెంకటేష్ గౌడ్,బెండ ప్రవీన్,బద్దం వాసుదేవ రెడ్డి, పంజాల సత్తయ్య గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్,టంటం రఘు,మంగ లింగేష్,గూడూరు మహిపాల్ రెడ్డి, మన్నె బాలరాజ్, పింగల్ అన్న సేవాదల్ అధ్యక్షుడు ఎండి మోయిన్, కాసుల రఘునందన్ గౌడ్, తుమ్మల నర్సింహ రెడ్డి,పేరబోయిన బస్వరాజ్ యాదవ్, పండాల రమేష్ గౌడ్, పండాల లక్ష్మణ్ గౌడ్,కాసుల టోని,పండాల లక్ష్మణ్ గౌడ్, కాసుల మహేష్ గౌడ్,రక్తని కృష్ణ,జస్వంత్,తదితరులు పాల్గొన్నారు.

***యాదగిరిగుట్ట :*** మంగళవారం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చాముల కిరణ్



కుమార్ రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా కాచారం ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వేంకట స్వామి, ఈ సందర్భంగా పద్మ మాట్లాడితే భువనగిరి పార్లమెంట్‌లో ఉన్న7 కాంసెన్సీలో ఉన్న ప్రజలు ఓట్లు వేసి గెలిపించినందుకు అందరికీ కృతజ్ఞతలు, కిరణన్నగిరి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపులో భాగంగా రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఇంచార్జ్ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జనగామ డిసిసి అధ్యక్షుడు కొవ్వూరి ప్రతాప్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం, ఇబ్రహీంపట్నం రంగారెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్, జిల్లా డిసిసి అధ్యక్షులు, మహిళా డిసిసి అధ్యక్షులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కాచారం గుడి అర్చకులు, డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, ఐవిఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్, సిద్దిపేట జిల్లా మహిళా జనరల్ సెక్రెటరీ శామ ప్రశాంతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

***నూతనకల్ :*** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం వెలువడిన పార్లమెంట్ నియోజకవర్గ ఫలితాలలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచాలను కాల్చి, కేకులను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా విజయోత్సవ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల కాంగ్రెస్ జిల్లా నాయకులు, మండల నాయకులు, ఆయా గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



***తుంగతుర్తి :*** కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంటరీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్



రెడ్డి 2,00,000 పై చిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మెయిన్ రోడ్డు పై బైక్ ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి సైదులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు పై కృషిచేసిన పలువురు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసినారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



***మునుగోడు :*** మునుగోడు ఎమ్మెల్యే రాజన్నకు మాటిచ్చాం కిరణ్ అన్నని గెలిపించాం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో ఎండలను సైతం లెక్కచేయకుండా రాత్రి, పగలు అహర్నిశలు కష్టపడి పని చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు రాజన్న అభిమానులకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో ఒక పోలింగ్ కేంద్రం ఉన్న గ్రామాలలో కాంగ్రెస్ పార్టీకి అధిక మెజారిటీ సాధించి మొదటి స్థానం సాధించి పెట్టిన చల్మెడ గ్రామ ప్రజలు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండవ స్థానంలో నిలిచిన సింగారం గ్రామం ఉండటడం అభినందనీయం అని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ముందే ఊహించామని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికలో తన సమీప ప్రత్యర్థి బిజెపి పార్టీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పై 2 లక్షల, 22 వేల 249 ఓట్ల మెజారిటీతో గెలిపించిన భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. భువనగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

***మునుగోడు :*** భువనగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా చామల కిరణ్



కుమార్ రెడ్డి ఘన విజయం సాధించిన సందర్భంగా మండలంలోని సింగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు మిత్ర పక్ష నాయకులతో కలసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బారిఎత్తున బాణాసంచా కాల్చి సీట్లు పంపిణీ పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒక పోలింగ్ కేంద్రం ఉన్న గ్రామాలలో మండలంలోనే సింగారం గ్రామం రెండో స్థానం సాధించిందన్నారు. అందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంభం చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పోగుల జానకి ప్రకాష్, జిల్లా లక్ష్మి వెంకటేశ్వర్లు, సోమగోని సంతోష్, ఉప్పునూతల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంభ వెంకట్ రెడ్డి, కుంభ భూపాల్ రెడ్డి, సోమగోని రమేష్,పగిల్ల శ్రీనివాస్, ఉప్పునూతల వెంకన్న, కుంభం లక్ష్మారెడ్డి, ఎంపల్ల అంజయ్య, గుంటుక శాంతి కుమార్, పిట్టల సూర్యప్రకాష్, రావుల నరసింహ, టీపీసీసీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ పగిల్ల చింటూ, పగిళ్ళ సత్యం, ఉప్పునూతల నగేష్, కుంభం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***మర్రిగూడ :*** భువనగిరి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్



రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండల వ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. మర్రిగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకటంపేట బాలయ్య, సీనియర్ నాయకులు మహేశ్వరం సతీష్, అజిలాపురం మాజీ సర్పంచ్ దండేకర్ అనసూయ అంజయ్య, బాయికాడి ఏడుకొండలు గౌడ్, శివన్నగూడెం మాజీ సర్పంచ్ చిట్యాల సబిత యాదగిరి రెడ్డి, మహిళా నాయకురాలు మెందు దీపికా రెడ్డి, పగడాల యాదయ్య, అంజయ్య, లింగయ్య, గొట్టిముక్కుల దేవేందర్, పంతంగి సుధాకర్, గ్యార యాదయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

***చింతపల్లి :*** రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ, దేశంలో 5వ అత్యధిక మెజారిటీ 5,52,000 సాధించిన ఎం.పి. కుందూరు రఘువీర్ రెడ్డికి నేనావత్ బాలునాయక్ దేవరకొండ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అదేవిధంగా చింతపల్లి ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల గిరి, మండల అధ్యక్షుడు నాగభూషణం, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు ఊరే లక్ష్మణ్, తక్కలపల్లి నర్సిరెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# టిడిపి నాయకుల సంబరాలు

## సింహ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో జరిగినటువంటి సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి విజయదుందిబి మోగించడంతో ఆలేరు నియోజకవర్గ యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సింహద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బాణాసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి ముఖ్య అతిథి తెలుగుదేశం పార్టీ ఆలేరు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీ రేగు బాల నరసయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఎన్నో అవమానాలను కష్టాలను బాధలను అనుభవించి ఆస్తులు ప్రాణాలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎంతో కృషి చేసే ఈరోజు తెలుగుదేశం పార్టీని అధికారంలో తీసుకురావడం అభినందనీయమని మరి తెలంగాణ రాష్ట్రంలో కూడా గత 20 సంవత్సరాలుగా అధికారంలో లేనప్పటికీ పార్టీకి అంకితమై పనిచేస్తున్నటువంటి కార్యకర్తలు కొన్ని లక్షల మంది ఉన్నారు. కాబట్టి పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పూర్వ వైభవం సంతరించుకోవాలంటే గత ఎన్ డి ఏ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాలలో కీలక భూమిక పోషించినటువంటి శ్రీ నారా చంద్రబాబునాయుడు మళ్లీ ఈరోజు ఆ పరిస్థితిలో వచ్చాయి. జాతీయస్థాయిలో చక్రం తిప్పేటువంటి పరిస్థితి వచ్చినది కాబట్టి ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హోదా తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ సాధించి రెండు రాష్ట్రాలను అభివృద్ధిలో పరుగులు పెట్టించే అవకాశం ఉన్నది. కాబట్టి చంద్రబాబు నాయుడు గారి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తెలుగుదేశం పార్టీ పూర్వ విభానికి కృషి చేస్తారని అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కీలక భూమిక పోషిస్తుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నరసింహ గౌడ్, భువనగిరి పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి తుర్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గుండా భాస్కర్, పట్టణ శాఖ అధ్యక్షులు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ కార్యదర్శి కళ్లెం బాబురావు గౌడ్, పార్టీ నాయకులు ఒదిగల బిక్షపతి, ఎడపల్లి సత్తయ్య, దుర్గపతి కృష్ణ, శేషగిరిరావు, కేరళ శ్రీశైలం యాదవ్, కొంతం సిద్ధార్థ, ముదుగుల రాములు, వనమాల సత్యనారాయణ, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సౌమ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న

## సీపీఐ జాతీయ నేత నారాయణ

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : అమెరికా ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి గుడ్ల సౌమ్య కుటుంబాన్ని మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకొని శోకార్థులైన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు బొలగాని సత్యనారాయణ, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, బబ్బూరి శ్రీధర్, పేరబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.